క్లుప్తంగా

రైతుబజార్లకు సెలవు రద్దు

సీతంపేట : దసరా సందర్భంగా అన్ని రైతుబజార్లకు మంగళ, బుధవారాల్లో సెలవు రద్దు చేసినట్లు నరసింహనగర్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు తెలిపారు. ఈ బుధవారం యథావిధిగా నరసింహనగర్ రైతు బజార్‌లో విక్రయాలు జరుపుతామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

తాటిచెట్లపాలెం: ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బీజేపీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 26,43,47,48,50,53 వార్డులకు చెందిన పలువురు లబ్ధిదారులకు సుమారు రూ. 18.57 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్యామల దీపిక, సురేష్ బాబు, నజీర్, నాగరాజు, రఘు, అప్పారావు, రామరాజు, అనిల్‌కుమార్, అరుణ్‌బాబు, అరుణ, బొడ్డేటి మోహన్, రాంబాబు, బ్రహ్మం, గోపాలరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ



బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ చాటిన కోన రమణ

దాబాగార్డెన్స్: విజయనగరం జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో కోన రమణ 75 కేజీల విభాగంలో ఐదవ స్థానంలో నిలిచాడు. మాస్టర్స్ విభాగంలో కూడా రమణ మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చాటాడు. ఇక లైట్ వెయిట్ విభాగంలో కోన మణిదీప్ తొలిసారిగా రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో పాల్గొని సత్తా చాటాడు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఇస్కాన్‌లో రావణ దహనం రేపు

కొమ్మాది: దసరా వేడుకల్లో భాగంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం రాత్రి 7 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రకటనలో తెలిపారు. 50 అడుగుల రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్స్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు ఉంటాయని తెలియజేశారు. ఆ రోజు ముందుగా మందిరంలో రాధాకృష్ణులను, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ముగిసిన టైలరింగ్ శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులు

గాజువాక: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కుట్టు శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఒకేషనల్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం పదిరోజుల పాటు సాగింది. 31 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు భారతి, కో ఆర్డినేటర్ మెట్ట సుధాకర్ భట్లు, జీసీడీవో గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొండవాలులో భయం.. భయం..

వర్షం కురిస్తే వణికిపోతున్న నివాసితులు
ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని వైనం
ఇళ్ల కింద మట్టి జారి ప్రమాదకరంగా మారిన జీవనం
పర్యటనలతో సరిపెట్టేస్తున్న అధికారులు, నాయకులు



తాత్కాలిక రక్షణ చర్యలే : సత్యానగర్‌లో మట్టి జారిపడిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు



కొండ పైకి నిర్మించిన మెట్ల మార్గం



మట్టి జారి దెబ్బతిన్న ఇంటి పునాదులు



సింగరాయిమెట్టలో రక్షిత గోడ నిర్మించాల్సిన ప్రాంతం

మురళీనగర్ : మురళీనగర్ సమీపంలోని జీవీఎంసీ 49, 50వ వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వర్షాకాలంలో ప్రాణాలు అరచేత పెట్టుకుని బతుకుతున్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతాల్లో పలుచోట్ల రక్షణ చర్యలు తీసుకున్నా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి పెళ్లలు, మట్టి జారిపడి నివాశిత ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సింగరాయి మెట్ట, సత్యానగర్ ప్రాంతాల్లో కొండవాలు నివాశితులు వర్షాలు కురిసేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 49, 50వ వార్డులోని సింగరాయిమెట్ట... 50వ వార్డు పరిధి సత్యానగర్ ప్రాంతాల్లో ఇళ్లు కొండపై వరకు నిర్మించి వందలాది కుటుంబాలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. వీరందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చి గత కొన్ని దశాబ్దాలుగా నివశిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వీరికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. వీరికి కొండపైకి విద్యుత్ దీపాలు, మంచి నీటి సదుపాయం కల్పనకు పైప్‌లైన్లు, ఇతర ప్రభుత్వ పరమైన సదుపాయాలు కల్పించారు. కొండపై వరకు సిమెంట్ రోడ్లు సైతం నిర్మించారు. కొండ శిఖరం వరకు ఇళ్లు నిర్మించుకుని వీరు జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో వీరికి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

వర్షాలు కురిస్తే వణికిపోతున్న జనం

ఈ ప్రాంతాల్లో సాధారణ రోజుల్లో ప్రశాంతంగా జీవిస్తున్నా వర్షాలు కురుస్తున్నాయంటే మాత్రం స్థానిక నివాసితులు వణికిపోతున్నారు. చిన్న చినుకులుగా మొదలైన వర్షం భారీగా కురుస్తున్న సమయాల్లో వీరి పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. ముఖ్యంగా దిగువ ప్రాంతాల్లో కొండ అంచుల వద్ద పక్కా భవనాలు నిర్మించుకున్న వారికి, కొండవాలు ఖాళీ ప్రదేశాల్లో ఉన్న నివాశితులు ప్రమాదం అంచున బతుకుతున్నారు. ఈ ప్రాంతాల్లో పక్కా భవనాల దిగువన ఉన్న ఖాళీ ప్రదేశాల ఎగువ అంచుల్లో మట్టి నానిపోయి పెళ్లలుగా దిగువకు జారిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు సత్యానగర్‌లో ఒక భవనం అంచున మట్టి జారిపడి ప్రదాకరంగా మారింది. సత్యానగర్‌లో ఇలా అనేక సార్లు జరిగింది. సింగరాయిమెట్టలో కొండ పైకి వెళ్లే మార్గం వద్ద 200 మీటర్ల ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించకపోవడంతో పిల్లలు, పెద్దలు ప్రమాదాలకు గురవుతున్నారు.

శాశ్వత చర్యలు చేపట్టని అధికారులు, నాయకులు

కొండవాలు ప్రాంతాల్లో అనేక పర్యాయాలు మట్టి పెళ్లలు విరిగిపడి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు జీవీఎంసీ అధికారులు, జెడ్సీ, స్థానిక నాయకులు పర్యటించి స్థానికులను పరామర్శించి వెళ్లిపోతున్నారు. పక్కాగా రక్షణ చర్యలు తీసుకుంటామని అనేక సార్లు హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదు. సత్యానగర్‌లో మట్టి జారి ప్రమాదకరంగా మారిన ప్రాంతాన్ని జెడ్సీ బి.రాము, స్థానిక కూటమి నాయకులు ఇటీవల పరిశీలించారు. మట్టి జారిన ప్రాంతంలో ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి తాత్కాలిక రక్షణ కల్పించారు. అయితే ఇటువంటి ప్రాంతాల్లో శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించనివ్వం



పోర్టు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 365 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదని, పోర్టు యాజమాన్యం వద్ద ఉన్న సొంత నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగర అభివృద్ధికి పోర్టు ఎంతో కీలకమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐద్వా నాయకురాలు సుమిత్ర, రైతు సంఘం నాయకుడు నాయన బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ,జె.సత్యనారాయణ, గణేష్, శంకర్రావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలో గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో 31వ వార్షికోత్సవం, దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుండి మూడురోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం దాసరి శ్రీరామమూర్తి దంపతులచే కుంజర మహాగణపతి, శ్రీ శారదామాత అమ్మవారికి, శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా కుంకుమపూజలు, సహస్ర నామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, వస్త్రాలంకరణ, పల్లకీసేవ, బాబా వారి గీతాలాపన (భజన), పుణ్యాహవచనం, నవగ్రహారాధాన, పంచగవ్యం, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. దసరా పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుండి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం, భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతాయని, కాశీ హరిద్వార్ నుండి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను బాబాకు అభిషేకించిన తర్వాత భక్తులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు కంకణాలు, సాయిబాబా ఫొటో, షిర్డీ నుండి తీసుకొచ్చిన విభూతి భక్తులకు అందించనున్నట్లు తెలిపారు.

4న మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, నిర్వాహకులు

దాబాగార్డెన్స్: మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం ఈ నెల 4న నిర్వహించనున్నారు. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజుకు ఆహ్వాన పత్రిక అందించి, ఆయన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కళాభిమానులు, సంగీతప్రియులు, సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొని మెలోడి క్రియేటర్స్ రజతోత్సవం విజయవంతం చేయాలని కోరారు. అలాగే సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక వైభవం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, నటరత్న, యువరత్న పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, కొణతాల రాజు, వి.ప్రభాకర్, మేడా మస్తాన్‌రెడ్డి, అరుణకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.


సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వెంకటాపురంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో దోమల వల్ల కలిగే వ్యాధులు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మంగళవారం కళాజాతా నిర్వహించారు. జీవీఎంసీ మలేరియా విభాగం అధికారుల ఆధ్వర్యంలో కళాకారులు వెంకటాపురం ప్రాంతంలో పలు చోట్ల ప్రదర్శనలిచ్చారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని.. మంచి నీరు ఎక్కువ రోజులు నిల్వలేకుండా పాత్రలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీ దగ్ధం



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో దగ్ధమైన స్కూటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో క్వార్టర్ ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధమైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-5లోని 505 డి క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ పి. సుందరరావు నివాసముంటున్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ముందు స్కూటీ పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కింద క్వార్టర్‌కు చెందిన వ్యక్తి స్కూటీ కాలిపోవడం గమనించి సుందరరావుకు సమాచారం ఇచ్చారు. వారు ఫైర్ విభాగానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా కాలిపోయింది.

గిరిజనులకు అప్పన్న చిత్రపటాల అందజేత



గిరిజనులకు అప్పన్న చిత్రపటాలు అందజేస్తున్న సురేంద్రస్వామి

సింహాచలం: అల్లూరి సీతారామరాజుజిల్లా ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీలోని తమ్మేగుల, అమ్లకూడ, శరబంద గుర్రాబయలు గ్రామాల్లో సింహాచలంకు చెందిన సింహాద్రిమఠం ఆధ్వర్యంలో మంగళవారం హిందు ధర్మ ప్రచారం చేశారు. సింహాద్రి మఠం నిర్వాహకుడు, శ్రీనృసింహ దీక్ష గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి హిందు ధర్మ విశిష్టతను గిరిజనులకు తెలియజేశారు. శ్రీనృసింహ దీక్ష విశిష్టతని చాటిచెప్పారు. 128 గిరిజన కుటుంబాలకు శ్రీనృసింహస్వామి చిత్రపటాలు, తువ్వాళ్లు అందజేశారు.

పలు రూపాల్లో పూజలందుకున్న దుర్గాదేవి



శ్రీలలితాపీఠంలో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు



శ్రీలలితాపీఠంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో లలితాదేవి



న్యూశ్రీనివాస్‌నగర్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న సత్యనారాయణరెడ్డి, రాయుడు రవి



తాటిచెట్లపాలెంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులతో కమిటీ సభ్యులు



అన్నప్రసాదం వడ్డిస్తున్న రెయ్యి వెంకటరమణ



దుర్గాలమ్మ, కుంచాలమ్మ ఆలయంలో చండీ హోమంలో గుజ్జు వెంకటరెడ్డి, భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో పద్మావతి అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో, శ్రీలలితాదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉదయం పీఠంలో చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మవారి సన్నిధిలో, మణిద్వీపంలో శ్రీచక్ర నవావరణ, సాముహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల మధ్య కాళీ హోమం, బగళాముఖి శాస్త్రోక్తంగా జరిపించారు. విద్యార్థుల చేత సాముహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజ చేయించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు పీఠంలో వనదుర్గా హోమం, శ్రీవిద్యా హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సీతంపేటలో...

స్థానిక సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి మంగళవారం దుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు జరిపారు.

శాంతి స్వరూపిణి ఆలయంలో..

పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గా దేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గా దేవి అలంకరణలో ఎరుపు రంగు చీరలో చూడముచ్చటగా దర్శనమిచ్చారు. బుధవారం మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

తాటిచెట్లపాలెంలో కుంకుమపూజలు..

తాటిచెట్లపాలెం: స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ సేవా సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకలలో భాగంగా మంగళవారం 108 మంది మహిళలతో ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. 4వ తేదీ వరకు కోలాటం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 4న అనుపు మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

దుర్గాదేవిగా లలితాంబిక..

మురళీనగర్: స్థానిక రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో మంగళవారం అష్టమి సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా లలితాదేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు భారీ సంఖ్యలో అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన చేశారు. అమ్మవారికి పులిహోర ప్రసాదం సమర్పించారు. సాయంత్రం బగాది సత్యనారాయణ, సీతారత్నం దంపతుల ఆధ్వర్యంలో నవదుర్గా పూజ, సువాసినిల ఆరాధన నిర్వహించారు. ఆలయం నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనక మహాలక్ష్మి, గాయత్రిదేవి, కనక దుర్గా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నసమారాధనను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూశ్రీనివాస్‌నగర్‌లో..

కంచరపాలెం: బర్మా క్యాంప్ పరిధి న్యూశ్రీనివాస్‌నగర్‌లో దుర్గాదేవి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి, న్యూశ్రీనివాసనగర్ గ్రామాధ్యక్షుడు చిర్ల సత్యనారాయణరెడ్డి హాజరై అగ్నిగుండం పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు రవి, భవానీ భక్తులు, మహిళలు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ, కుంచాలమ్మ ఆలయంలో..

బాపూజీనగర్ దుర్గాలమ్మ, కుంచాలమ్మ ఆలయంలో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు నాగశాస్త్రి నేతృత్వంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ శాఖ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి దంపతులు చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో జి.శ్రీదేవి, ధీరజ్ కుమార్, సుధారాణి, జాహ్నవి, రాధ, నాగమణి, వెంకటి, సంగీత, మంజుల, ప్రభ, రజనీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భవానీలకు అన్నసమారాధన



భవానీ మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నమ్మి రాజా రమేష్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో హనుమాన్ కన్‌స్ట్రక్షన్ అధినేత రాజారమేష్ ,రేవతి మంగళవారం భవానీలకు అన్నసమారాధన నిర్వహించారు. దుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులు అందించారు. కార్యక్రమంలో నమ్మి కొండలరావు, రమణమ్మ, ఖుషి, మాన్విత, జశ్వంత్ పాల్గొన్నారు.